క్లుప్తంగా

పెదనందిపాడు విద్యుత్ ఏఈగా రామాంజనేయులు

పెదనందిపాడు: విద్యుత్ ఏఈగా బి.రామాంజనేయులు బుధవారం బాధ్యతలు స్వీకరించారు. గుంటూరు ఎంఆర్‌టీలో పని చేస్తున్న ఆయన ఇటీవల జరిగిన సాధారణ బదిలీల్లో భాగంగా పెదనందిపాడుకు బదిలీపై వచ్చారు. బుధవారం మధ్యాహ్నం కార్యాలయానికి వచ్చిన ఆయన సబ్ ఇంజినీర్ కరుణాకర్ నుంచి బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా రామాంజనేయులు మాట్లాడుతూ విద్యుత్ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఆయన చెప్పారు. లైన్‌మెన్‌లు, విద్యుత్ శాఖ సిబ్బంది ఆయన్ను కలసి శుభాకాంక్షలు తెలిపారు.

అక్రమ మట్టి తవ్వకాలకు అడ్డుకట్ట వేయండి

నడింపాలెం (ప్రత్తిపాడు): మండలంలోని నడింపాలెంలో అక్రమ మట్టి తవ్వకాల్ని వెంటనే నిలిపివేయాలని వైఎస్సార్ సీపీ ఎంపీటీసీ సభ్యులు పూర్ణి వెంకటేశ్వరరావు, వి. మాణిక్యరావు కోరారు. ఈ మేరకు స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం ఎంపీడీవో శ్రీరమ్యను కలసి వినతి పత్రం సమర్పించారు. చెరువులో మట్టిని పొలాలకు ఎకరాకు వెయ్యి, పన్నెండు వందల చొప్పున అమ్ముకుంటున్నారంటూ సర్పంచ్‌పై ఫిర్యాదు చేశారు.విషయాన్ని తహసీల్దార్, ఎస్‌ఐల దృష్టికి తీసుకువెళ్లి, వాహనాల్ని సీజ్ చేయిస్తానని ఎంపీడీవో చెప్పారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి

మరొకరికి గాయాలు



గుంటూరు రూరల్: ఆటో, ద్విచక్ర వాహనం ఢీకొన్న సంఘటనలో ఒకరు మృతి చెందగా మరొకరు గాయపడిన సంఘటన బుధవారం నల్లపాడు పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. సీఐ శ్రీనివాసరావు తెలిపిన వివరాల ప్రకారం.. విశాఖపట్నానికి చెందిన జొన్నాడ సిద్ధార్థ(25) స్థానిక కేర్ డెంటల్ కాలేజీలో చదువుతున్నాడు. స్నేహితుడు దవ్వల సాయికృష్ణతో కలసి ద్విచక్ర వాహనంపై ఎన్‌హెచ్ 16 సర్వీస్ రోడ్డులో చిలకలూరిపేట వైపు వెళుతున్నారు. ఈ సమయంలో అటు వైపు నుంచే వస్తున్న ఆటోను పొత్తూరు వద్ద ఎదురుగా ఢీకొన్నారు. ప్రమాదంలో సిద్ధార్థ అక్కడిక్కడే మృతి చెందగా, గాయపడిన సాయిని 108లో జీజీహెచ్‌కు తరలించారు. మృతుని కుటుంబ సభ్యులకు పోలీసులు సమాచారం అందించారు. సిద్ధార్థ మృతదేహాన్ని పోస్ట్‌మార్టం నిమిత్తం జీజీహెచ్ మార్చురీకి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వీఆర్వోల బదిలీలు

పెదకాకాని: ప్రభుత్వం వీఆర్వోల బదిలీల ప్రక్రియ వేగవంతం చేసింది. మండలంలో 10మంది బదిలీపై వెళ్లనున్నారు. ఈ మేరకు ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలు జారీ అయ్యాయి. పెదకాకాని రెవెన్యూ ఇన్‌స్పెక్టర్‌గా పనిచేస్తున్న వంశీకృష్ణను తాడికొండ తహసీల్దార్ కార్యాలయానికి బదిలీ చేశారు. మండలంలోని వెంకటకృష్ణాపురం వీఆర్వో పుల్లారెడ్డిని పిడుగురాళ్ల టౌన్ 7వ సచివాలయం, పెదకాకాని- 1లో పనిచేస్తున్న తియ్యగూర శ్రీనివాసరెడ్డిని ప్రత్తిపాడు మండలంలోని నడింపాలెం- 1 సచివాలయం, ఉప్పలపాడు-2లో పనిచేస్తున్న జి. ప్రభాకరరావును దుగ్గిరాల మండలం పేరిగపూడి, వెనిగండ్ల -1 సచివాలయంలో పనిచేస్తున్న జి. శ్రీనివాసరావును ప్రత్తిపాడు మండలంలోని గనికపూడి బదిలీ చేశారు. కొప్పురావూరులో పనిచేస్తున్న శ్రీదేవిని గుంటూరు 136వ సచివాలయం, పెదకాకాని-5లో పనిచేస్తున్న అమృతను తెనాలి 24వ సచివాలయం వీఆర్వోలుగా బదిలీ చేశారు. ఉప్పలపాడు- 1లో పనిచేస్తున్న ముఖర్జీని చినకాకాని- 1 సచివాలయానికి, అగతవరప్పాడులో పనిచేస్తున్న శివ రామకోటేశ్వరరావును వట్టిచెరుకూరు మండలంలోని వేమవ్రు, నంబూరులో పనిచేస్తున్న జి. రాంబాబును తాడికొండ- 1 సచివాలయానికి, నంబూరులో పని చేస్తున్న నాయబ్ రసూల్‌ను గుంటూరు- 3 సచివాలయానికి బదిలీ చేస్తూ ఆదేశాలు జారీ అయ్యాయి. బదిలీ అయిన వారి స్థానంలో ఆయా ప్రాంతాల నుంచి వీఆర్వోలు రావాల్సి ఉంది.

పారిశుద్ధ్య సిబ్బందికి ఈ-ఆటోల పంపిణీ



గుంటూరు రూరల్: పరిసరాల పరిశుభ్రత పాటిస్తూ, పర్యావరణాన్ని కాపాడుకుందామని 26వ డివిజన్ కార్పొరేటర్ శ్యామల వెంకటరమణాదేవి తెలిపారు. డివిజన్ పరిధిలోని పొత్తూరు, అంకిరెడ్డిపాలెం గ్రామాల పారిశుద్ధ్య సిబ్బందికి బుధవారం నూతనంగా ఈ- ఆటోలను అందజేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ పరిసరాల్ని పరిశుభ్రంగా ఉంచుకుని ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని సూచించారు. చెత్తను ఎక్కడపడితే అక్కడ వేయకుండా బిన్స్‌లోనే వేయాలని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం, ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి ప్రతిష్టాత్మకంగా చేపట్టిన క్లీన్ గుంటూరు కార్యక్రమంలో భాగంగా ప్రతి ఒక్కరూ పరిశుభ్రత పాటించాలని తెలిపారు. కార్యక్రమంలో గ్రామ మాజీ సర్పంచ్ శ్యామల బ్రహ్మారెడ్డి పాల్గొన్నారు.

జీజీహెచ్ ఆర్థోపెడిక్‌లో 24X7 సేవలు

- జిల్లావ్యాప్తంగా భారీ సంఖ్యలో రోగుల రాక
- పైసా ఖర్చు లేకుండా ఉచితంగా కార్పొరేట్ వైద్యం
- మాడ్యులర్ ఆపరేషన్ థియేటర్ అత్యాధునిక ఆపరేషన్లు



ఆధునిక ఆపరేషన్ థియేటర్



జీజీహెచ్‌లోని ఆర్థోపెడిక్ వార్డు

గుంటూరు మెడికల్: రోడ్డు ప్రమాదాల్లో కాళ్లు, చేతులు విరిగిన వారికి గుంటూరు జీజీహెచ్ ఆర్థోపెడిక్ వైద్య విభాగంలో ఉచితంగా కార్పొరేట్ వైద్యసేవల్ని అందిస్తున్నారు. ఇతర రాష్ట్రాలకు చెందిన ఎందరో లారీ డ్రైవర్లు, క్లీనర్లు, ఇతర వాహన చోదకులు జిల్లాలో జరిగిన రోడ్డు ప్రమాదాల్లో గాయపడి ఇక్కడ చికిత్స పొందారు. ఆర్థోపెడిక్ వైద్యులు, సిబ్బంది పెద్ద మనస్సుతో వారికి ఉచితంగా ఆపరేషన్లు చేసి కోలుకునేవరకు కుటుంబ సభ్యుల మాదిరిగా సేవలందించారు. దాతల సహాయంతో ఉచితంగా అంబులెన్సులు ఏర్పాటు చేసి వారి సొంత రాష్ట్రాలకు సైతం తరలిస్తున్నారు. రాత్రీ పగలు తేడా లేకుండా రోడ్డు ప్రమాదాల్లో గాయపడి కాళ్లు చేతులు, నడుము విరిగిన వారికి తక్షణమే ఆపరేషన్లు చేసి నొప్పి నివారణతోపాటు, వారు సక్రమంగా నడిచేలా వైద్య సేవలు అందిస్తున్నారు. కార్పొరేట్ ఆస్పత్రుల్లో ఉండే మాడ్యులర్ ఆపరేషన్ థియేటర్స్ అందుబాటులో ఉండటంతో ఆధునిక వైద్యసేవల్ని పేదలకు ఉచితంగా అందిస్తున్నారు.

ప్రతి రోజూ 350 మందికి వైద్య సేవలు

ఆర్థోపెడిక్ వైద్య విభాగంలో ప్రతి రోజూ 350 మంది చికిత్సతో పాటు 10 మందికి ఎలక్టివ్ ఆపరేషన్లు చేస్తున్నారు. అత్యవసర ఆపరేషన్ థియేటర్‌లో ప్రతి రోజూ తీవ్ర గాయాలతో వస్తున్న ఇద్దరికి అర్ధరాత్రి సమయంలో సైతం ఆపరేషన్లు ఉచితంగా చేస్తున్నారు. సోమవారం నుంచి శనివారం వరకు ఓపీ విభాగంలోని 14వ నంబర్ గదిలో ఆర్థోపెడిక్ వైద్యసేవల్ని అందిస్తున్నారు. ఓపీలో పరీక్షల అనంతరం అడ్మిషన్లు అవసరమైన వారిని ఇన్‌పేషెంట్ విభాగంలోని 113 నంబర్ గదిలో అడ్మిట్ చేసుకుని వైద్యం అందిస్తున్నారు.

పలు జిల్లాల బాధితులకు వైద్య సేవలు

గుంటూరు జిల్లాలోని వివిధ ప్రాంతాలకు చెందిన రోగులు, రోడ్డు ప్రమాద బాధితులతో పాటుగా కృష్ణా, ప్రకాశం, తూర్పు గోదావరి, పశ్చిమ గోదావరి జిల్లాలకు చెందిన రోగులు చికిత్స కోసం గుంటూరు జీజీహెచ్‌కు వస్తున్నారు. రాష్ట్రంలో ఏ ప్రాంతంలో పెద్ద ప్రమాదం జరిగినా మెరుగైన చికిత్స కోసం జీజీహెచ్‌కే బాధితుల్ని తరలిస్తున్నారు. రోడ్డు ప్రమాదాల్లో గాయపడిన ఇతర రాష్ట్రాలకు చెందిన రోగుల్ని సైతం అడ్మిట్ చేసుకుంటున్నారు. వారికి బంధువులు లేకపోయినా, వారి భాష రాకపోయినా బాధల్ని అర్థం చేసుకుంటూ మూడు నెలలపాటు సైతం వైద్య సేవల్ని అందిస్తూ మానవత్వాని చాటుకుంటున్నారు. ఇన్‌పేషెంట్ విభాగంలో 140 పడకలు ఉండగా ఒకసారి దానికి మించి రోగులు చికిత్స పొందుతున్నారు. కాలు లేదా చెయ్యి విరిగిన వారికి ఆపరేషన్ చేసిన పిదప వారు కోలుకోవడానికి నెలా లేదా రెండు నెలల సమయం పడుతుంది. రోగికి నయాపైసా ఖర్చులేకుండా పూర్తిగా కోలుకునే వరకు అన్ని వైద్యసేవలను ఉచితంగానే అందిస్తున్నారు.

కార్పొరేట్ దీటుగా వైద్య సేవలు



ఆర్థోపెడిక్ వైద్య విభాగంలో కార్పొరేట్ ఆసుపత్రులకు దీటుగా ఉచిత వైద్య సేవలు అందిస్తున్నాం. ఒక అసోసియేట్ ప్రొఫెసర్, పది మంది అసిస్టెంట్ ప్రొఫెసర్లు, పీజీ వైద్య విద్యార్థులు, హౌస్ సర్జన్లు, నర్సింగ్ సిబ్బంది 24 గంటలూ ఆసుపత్రిలో అందుబాటులో ఉంటారు. రోడ్డు ప్రమాద బాధితులకు తక్షణమే మెరుగైన వైద్యం అందించేలా చర్యలు తీసుకుంటున్నాం. ఎలక్టివ్ సర్జరీలతో పాటు ఎమర్జెన్సీ సైతం చేస్తున్నాం. ఉన్నతి ఫౌండేషన్ సహాయంతో వంద మందికి పైగా మోకీళ్ల మార్పిడి ఆపరేషన్లు సైతం విజయవంతంగా చేశాం. నేడు తుంటి మార్పిడి ఆపరేషన్లు కూడా చేస్తున్నాం.

– డాక్టర్ యశస్వి రమణ, ఆర్థోపెడిక్ విభాగాధిపతి, గుంటూరు జీజీహెచ్

ఖరీదైన ఆపరేషన్ ఉచితంగా చేశారు



కోవిడ్ సోకి నా తుంటి అరిగిపోయింది. నడవలేక పోవడం, నిలబడలేక పోవడం వంటి సమస్యలతో గతనెల గుంటూరు జీజీహెచ్ ఆర్థోపెడిక్ వైద్య విభాగానికి వచ్చా. వైద్యులు పరీక్షలు చేసి అడ్మిట్ చేసుకున్నారు. సుమారు రూ. 2 లక్షలు ఖరీదు చేసే టోటల్ హిప్ రీప్లేస్‌మెంట్ ఆపరేషన్ ఉచితంగా చేశారు.

– వనమాల రమేష్, దేవరపల్లి, వల్లూరు మండలం, కృష్ణాజిల్లా

గృహ నిర్మాణాల్లో పురోగతి తప్పనిసరి

ఎంపీడీవో శ్రీరమ్య



గృహ నిర్మాణాలపై సమీక్షిస్తున్న అధికారులు

ప్రత్తిపాడు: గృహ నిర్మాణాల్లో పురోగతి కనిపించేలా లబ్ధిదారులకు అవగాహన కల్పించాలని ఎంపీడీవో శ్రీరమ్య అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం హౌసింగ్ ఏఈ సురేష్‌బాబు అధ్యక్షతన సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఎంపీడీవో శ్రీరమ్య సచివాలయాల వారీగా ప్రగతిపై సమీక్షించారు. పురోగతి ఆశించిన స్థాయిలో లేకపోవడంపై అసహనం వ్యక్తం చేశారు. ముందు వేసవిలోనే లబ్ధిదారులతో ఇళ్ల నిర్మాణానికి అడుగులు ముందుకు వేయించలేకపోతే, రానున్న వర్షాకాలంలో ఇంకా తీవ్ర సమస్యలు ఎదుర్కోవలసి వస్తుందని వివరించారు. ప్రతి సచివాలయం పరిధిలోని ఇంజినీరింగ్ అసిస్టెంట్లు కచ్చితంగా నిర్దేశిత లక్ష్యాల్ని అధిగమించాలని ఆదేశించారు. ఇంకుడు గుంతల వల్ల కలిగే ప్రయోజనాల్ని లబ్ధిదారులందరికీ వివరించి, ఇంటి ముందు తవ్వుకొనేలా అవగాహన కల్పించాలని సూచించారు. లే అవుట్స్‌లో సమస్యల్ని తన దృష్టికి తీసుకురావాలని చెప్పారు. ప్రత్తిపాడు లేఅవుట్‌లో మురుగు కాలువల ఏర్పాటుతో పాటు స్థలాల హద్దుల నిర్ణయంపై తహసీల్దార్‌తో మాట్లాడి చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. సమావేశంలో వైఎస్సార్ క్రాంతి పథం ఏపీఎం సురేష్, పంచాయతీ కార్యదర్శులు, ఇంజినీరింగ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

ప్రతి పంచాయతీకి శుద్ధ జలం సరఫరా

– పంచాయతీ కార్యదర్శులకు ఎంపీడీవో శ్రీరమ్య ఆదేశం



చినకోండ్రుపాడులో కలుషిత నీటి సరఫరాపై సెక్రటరీ ఖాజాను ప్రశ్నిస్తున్న ఎంపీడీవో

సాక్షి ఎఫెక్ట్

ప్రత్తిపాడు: ప్రతి గ్రామ పంచాయతీలోనూ ప్రజలకు శుద్ధ జలాన్ని అందించాల్సిందేనని ఎంపీడీవో శ్రీరమ్య సెక్రటరీలను ఆదేశించారు. ప్రత్తిపాడు మండలం నడింపాలెం పంచాయతీ పరిధిలోని చినకోండ్రుపాడులో కుళాయిల ద్వారా సరఫరా చేస్తున్న మంచినీరు పచ్చగా ఉంటోందని, అధికారులెవ్వరూ పట్టించుకోవడం లేదంటూ ఈ నెల 12న 'సాక్షి'లో ప్రచురితమైన 'అధికారుల నిర్లక్ష్యం–ప్రజలకు గరళం'పై ఎంపీడీవో స్పందించారు. సంబంధిత పంచాయతీ సెక్రటరీ ఖాజాతో పాటు సెక్రటేరియట్ బాధ్యుల్ని ప్రశ్నించారు.ఆ గ్రామంలో సమస్యను పరిష్కరించామని, ప్రస్తుతం శుద్ధ జలాన్ని సరఫరా చేస్తున్నామని వారు వివరణ ఇచ్చారు. నీటిని పరీక్షలకు కూడా పంపినట్లు చెప్పారు. శుద్ధ జలం సరఫరా చేస్తే నీళ్లు పచ్చగా ఎందుకు వస్తున్నాయని ఎంపీడీవో ప్రశ్నించడంతో అధికారుల నుంచి సమాధానం కరువైంది. ఇక నుంచి ప్రతి పంచాయతీలో కచ్చితంగా ఫిల్టర్ బెడ్లను శుభ్రం చేయించడంతో పాటు శుభ్రం చేసిన తేదీని ట్యాంకుపై రాయాలని ఆదేశించారు. ఫిల్టర్ చేసిన అనంతరం క్లోరినేషన్ చేసి గ్రామంలోకి సరఫరా చేయాలని చెప్పారు. శుద్ధ జలం అందించని పక్షంలో చర్యలు తీసుకుంటానని సెక్రటరీలను హెచ్చరించారు. ప్రజలకు అత్యంత కీలకమైన నీటి విషయంలో ఏ మాత్రం అలసత్వం వహించినా ఉపేక్షించబోమని తెలిపారు.

విద్యాభివృద్ధికి సీఎం జగన్ కృషి



తుమ్మలపాలెం (ప్రత్తిపాడు): విద్యాభివృద్ధికి సీఎం వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి విశేష కృషి చేస్తున్నారని తుమ్మలపాలెం ఎంపీటీసీ సభ్యురాలు మేరుగ సుభాషిణి అన్నారు. స్థానిక యూపీ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు బుధవారం జగనన్న విద్యాకానుక కిట్లు పంపిణీ చేశారు. ముఖ్య అతిథిగా హాజరైన ఎంపీటీసీ సభ్యురాలు సుభాషిణి విద్యార్థులకు స్కూల్ బ్యాగు, యూనిఫాంలు, షూలు, పాఠ్య పుస్తకాలు, నోటు పుస్తకాలతో కూడిన కిట్‌ను అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలు సమూలంగా మారిపోయాయని తెలిపారు. కార్యక్రమంలో పార్టీ నాయకుడు మేరుగ ఏసోబు, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ముక్కంటి, ఉపాధ్యాయులు రమాదేవి, విజయలక్ష్మి, మదనమోహన్ పాల్గొన్నారు.

ఒకరి దానం - మరొకరి ప్రాణం



అవగాహన ర్యాలీని నిర్వహిస్తున్న ఆర్‌వీఆర్‌జేసీ కళాశాల యాజమాన్యం, విద్యార్థులు

గుంటూరు రూరల్: రక్తదానం ప్రాణదానంతో సమానమని చేబ్రోలు హనుమయ్య ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్. విద్యాధర్ తెలిపారు. చౌడవరం గ్రామంలోని చిప్స్ కళాశాలలో బుధవారం ప్రపంచ రక్త దాన దినోత్సవం సందర్భంగా ఎన్‌ఎస్‌ఎస్ యూనిట్, ఐపీఎఎస్‌ఎఫ్ చిప్స్ చాప్టర్ సంయుక్త ఆధ్వర్యంలో రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల విద్యార్థులు అధ్యాపకులు రక్తదానం చేశారు. కార్యక్రమాన్ని కళాశాల డెప్యూటీ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ పి.నీలిమ, డాక్టర్ ఆర్. మమత, మెడికల్ ఆఫీసర్ రమేష్ పర్యవేక్షించారు. రక్తదానం చేసిన విద్యార్థులు, అధ్యాపకుల్ని కళాశాల అధ్యక్షుడు డాక్టర్ ఆర్. శ్రీనివాస్, కార్యదర్శి డాక్టర్ సి.ఎస్. శ్రీనివాస్, కోశాధికారి డాక్టర్ ఆర్. గోపాలకృష్ణ అభినందించారు.

ఆర్‌వీఆర్‌జేసీ కళాశాలలో...

2004 సంవత్సరం నుంచి ఇప్పటి వరకు 9,000 మందికి పైగా తమ కళాశాల విద్యార్థులు రక్తదానంలో పాల్గొనడం వారి సేవానిరతికి నిదర్శనమని ఆర్‌వీఆర్‌జేసీ ఇంజనీరింగ్ కళాశాల అధ్యక్షుడు డాక్టర్ ఆర్. శ్రీనివాస్ తెలిపారు. నగర శివారుల్లోని చౌడవరంలో గల కళాశాలలో బుధవారం ప్రపంచ రక్త దాతల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల యాజమాన్యం, విద్యార్థులు, సిబ్బంది రక్తదాన అవగాహనపై ర్యాలీ నిర్వహించారు. బ్యానర్లు, ప్లకార్డులను ప్రదర్శిస్తూ 'రక్తదానం చేద్దాం – ప్రాణదాతలుగా నిలుద్దాం', 'ఒకరి దానం – మరొకరి ప్రాణం' అంటూ నినాదాలు చేశారు. అనంతరం కళాశాల ప్రాంగణంలో ప్రిన్సిపాల్ డాక్టర్ కొల్లా శ్రీనివాస్ సిబ్బంది, విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ ఆర్. గోపాలకృష్ణ, ట్రెజరర్ డాక్టర్ కె. కృష్ణప్రసాద్, అకడమిక్ అండ్ ఆర్‌డీ డైరెక్టర్ డాక్టర్ కె. రవీంద్ర, కళాశాల డైరెక్టర్ ఫైనాన్స్ అండ్ అడ్మినిస్ట్రేషన్ డాక్టర్ ఎన్.వి. శ్రీనివాసరావు, కళాశాల ఎన్‌ఎస్‌ఎస్ కోఆర్డినేటర్స్ డాక్టర్ ఎం. సుధాకర్, డాక్టర్ జి.రామ్‌మోహన్‌బాబు, డాక్టర్ వి. రామకోటేశ్వరరావు కళాశాల డీన్‌లు పాల్గొన్నారు.

ఎంఈవో-2 పోస్టుల భర్తీ నిర్ణయంపై హర్షం

గుంటూరు ఎడ్యుకేషన్: క్షేత్రస్థాయిలో విద్యారంగ కార్యకలాపాల్ని పర్యవేక్షించడంలో ఎంతో కీలకమైన మండల విద్యాశాఖాధికారి పోస్టులకు అదనంగా ప్రతి మండలంలో రెండో ఎంఈవో పోస్టు భర్తీకి సీఎం వై.ఎస్. జగన్‌మోహన్ రెడ్డి నిర్ణయం తీసుకోవడంపై వైఎస్సార్ టీచర్స్ ఫెడరేషన్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వై.థామస్‌రెడ్డి, ఎస్. ప్రేమ్‌సాగర్ బుధవారం ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల రెగ్యులరైజేషన్ నిర్ణయంతో పాటు, సీపీఎస్ స్థానంలో జీపీఎస్‌ను తీసుకురావడం వంటి నిర్ణయాలతో ఉద్యోగులు తన కుటుంబ సభ్యులే అని సీఎం వైఎస్ జగన్ నిరూపించారని తెలిపారు. ఆయా నిర్ణయాలపై సీఎంకు కృతజ్ఞతలు తెలియజేశారు.

అక్రమంగా మద్యం విక్రయిస్తున్న వ్యక్తి అరెస్టు



స్వాధీనం చేసుకున్న మద్యం బాటిళ్లతో ఎస్‌ఐ రవీంద్రబాబు

కోయవారిపాలెం (ప్రత్తిపాడు): అక్రమంగా మద్యం విక్రయిస్తున్న వ్యక్తిని ప్రత్తిపాడు పోలీసులు అరెస్టు చేసిన ఘటన మండలంలో చోటుచేసుకుంది. ఎస్‌ఐ డి. రవీంద్రబాబు తెలిపిన ప్రకారం.. ప్రత్తిపాడు మండలం కోయవారిపాలెం గ్రామానికి చెందిన రామినేని శ్యామ్‌బాబు అక్రమంగా మద్యం అమ్ముతున్నాడన్న సమాచారం ఎస్‌ఐకు అందింది. దీంతో బుధవారం రాత్రి సిబ్బందితో దాడి చేయగా, అతని వద్ద ఓల్డ్ టావెరెన్ డీలక్స్ విస్కీ నాలుగు బాటిళ్లు దొరికాయి. వాటిని స్వాధీనం చేసుకుని సీజ్ చేస్తున్నామని, కేసు నమోదు చేసి కోర్టుకు హాజరు పరచనున్నట్లు ఎస్‌ఐ రవీంద్రబాబు తెలిపారు.

అంగన్‌వాడీ కేంద్రాల్లో నాణ్యమైన విద్య



ప్రత్తిపాడు: అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులకు నాణ్యమైన విద్య అందిస్తున్నట్లు ఐసీడీఎస్ గొట్టిపాడు సెక్టార్ సూపర్‌వైజర్ అరుణ తెలిపారు. మండలంలోని కొండేపాడు అంగన్‌వాడీ కేంద్రంలో బుధవారం జనభాగీదారీ కార్యక్రమాన్ని నిర్వహించారు. షెడ్యూల్‌లో భాగంగా ఇళ్లలోని నిరుపయోగ వస్తువులతో పిల్లల అభివృద్ధికి వినియోగించే పప్పెట్స్, రకరకాల బొమ్మలు తయారు చేసి కేంద్రంలో ప్రదర్శించారు. అనంతరం ప్రీస్కూల్ గ్రాడ్యుయేషన్ డే నిర్వహించారు. చిన్నారులకు ప్రీస్కూల్ సర్టిఫికెట్లు అందించారు. ఈ సందర్భంగా అరుణ మాట్లాడుతూ పిల్లల్ని తల్లిదండ్రులు ప్రతి రోజూ అంగన్‌వాడీ కేంద్రాలకు పంపడం ద్వారా శారీరక, మానసిక అభివృద్ధి పెరుగుతుందని తెలిపారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో పిల్లలకు ప్రేరణ కలిగేలా ఆట పాటల ద్వారా విద్యను అందిస్తామని చెప్పారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు యశోద, జిక్కి, రజిని, తల్లులు పాల్గొన్నారు.

'దిశ' యాప్‌తో మహిళలకు భద్రత



యువతులు, మహిళలతో దిశా యాప్ డౌన్‌లోడ్ చేయిస్తున్న సీఐ సుబ్బారావు, ఎస్‌ఐ రవీంద్రబాబు

తిక్కిరెడ్డిపాలెం (ప్రత్తిపాడు): దిశ యాప్‌తో మహిళలకు ఆపత్కాల సమయంలో భద్రత లభిస్తుందని ప్రత్తిపాడు సీఐ ఎం.వి. సుబ్బారావు అన్నారు. జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు మండల పరిధిలోని తిక్కిరెడ్డిపాలెంలో గుంటూరు–పర్చూరు పాత మద్రాసు రోడ్డుపై బుధవారం సాయంత్రం దిశా యాప్‌పై సీఐ స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. మహిళలు, యువతుల మొబైల్స్‌లో దిశ యాప్‌ను డౌన్‌లోడ్ చేయించి, ఇన్‌స్టాల్ చేయించారు. దిశ యాప్ పనితీరు, కలిగే ప్రయోజనాలు, వినియోగించే తీరును సీఐ సుబ్బారావు, ఎస్‌ఐ డి. రవీంద్రబాబులు వివరించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ గ్రామాల్లోని యువతులు, గృహిణులు ప్రతి ఒక్కరూ తమ మొబైల్స్‌లో దిశ యాప్ డౌన్లోడ్ చేసుకునేలా మహిళా పోలీసులు అవగాహన కల్పించాలని తెలిపారు. దేశంలో ఎక్కడా లేనివిధంగా దిశ యాప్‌ను ఏపీ ప్రభుత్వం అందుబాటులోకి తీసుకువచ్చిందని చెప్పారు. యాప్ ద్వారా అత్యవసర సమయాల్లో, ఆపత్కాల పరిస్థితుల నుంచి పోలీసుల సహకారంతో బయట పడవచ్చని సూచించారు. కార్యక్రమంలో మహిళా పోలీసులు పాల్గొన్నారు.

కొలకలూరి ఇనాక్‌కు వెండి కిరీటం బహూకరణ



ఇనాక్‌ను సన్మానిస్తున్న వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు డొక్కా మాణిక్యవరప్రసాద్ తదితరులు

గుంటూరు రూరల్: విద్య ద్వారా ఉన్నత శిఖరాల్ని చేరవచ్చని పద్మశ్రీ అవార్డు గ్రహీత, డాక్టర్ వైఎస్సార్ జీవన సాఫల్య అవార్డు గ్రహీత డాక్టర్ కొలకలూరి ఇనాక్‌ను చూస్తే తెలుస్తుందని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు డొక్కా మాణిక్యవరప్రసాద్ తెలిపారు. మండలంలోని వెంగళాయపాలెంలో బుధవారం జెడ్పీటీసీ మాజీ సభ్యుడు కొలకలూరి కోటేశ్వరరావు ఆధ్వర్యంలో డాక్టర్ కొలకలూరి ఇనాక్‌కు జీవనసాఫల్య పురస్కారం, వెండి కిరీటం బహూకరణతో పాటు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా డొక్కా మాణిక్యవరప్రసాద్ ఇనాక్‌ను ఆదర్శంగా తీసుకుని ప్రతి ఒక్కరూ చక్కగా చదువుకుని ఉన్నత శిఖరాలను చేరాలని ఆకాంక్షించారు. రాష్ట్ర ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి విద్య, వైద్య రంగాలపై ప్రత్యేక శ్రద్ధతో కృషి చేస్తున్నారని తెలిపారు. అవార్డు గ్రహీత డాక్టర్ కొలకలూరి ఇనాక్ మాట్లాడుతూ ప్రేమ ఆప్యాయతలు చూపి, అవార్డును అందించినందుకు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో రిటైర్డ్ డీఐజీ బాలస్వామి, డాక్టర్ కె. భగవాన్‌దాస్, అత్తోట జోసఫ్ పాల్గొన్నారు.

పరస్పర సహాయ, సహకారాలతోనే సుస్థిర అభివృద్ధి



సదస్సులో పాల్గొన్న అంగన్‌వాడీ కార్యకర్తలు

గుంటూరు రూరల్: నగర శివారు లాం నందున్న ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం సామాజిక విజ్ఞాన కళాశాలలో జీ- 20 మహిళల నేతృత్వంలో సుస్థిర అభివృద్ధి లక్ష్యాలపై బుధవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా డీన్ డాక్టర్ సీహెచ్. చిరంజీవి మాట్లాడుతూ సుస్థిర అభివృద్ధి సాధించాలంటే ప్రపంచం మొత్తం వసుధైక కుటుంబం లాగా పరస్పర సహాయ, సహకారాలు అందిపుచ్చుకోవాలని తెలిపారు. గుంటూరు సీడీపీవో కృష్ణవేణి మాట్లాడుతూ సుస్థిర అభివృద్ధి లక్ష్యాల సాధనలో మహిళ, శిశు సంక్షేమ శాఖ చేపడుతున్న వివిధ కార్యక్రమాల్ని వివరించారు. 2030 నాటికి సుస్థిర అభివృద్ధి లక్ష్యాల సాధన దిశగా కమ్యూనిటీ సైన్స్ కళాశాలతో కలసి కృషి చేస్తామని తెలిపారు. కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ ఎస్. చైతన్యకుమారి మాట్లాడుతూ సుస్థిర అభివృద్ధి సాధించడంలో ముఖ్యమైన వ్యక్తిగత, ఆర్థిక, సామాజిక, పర్యావరణ అంశాల్ని వివరించారు. ప్రొఫెసర్ డాక్టర్ బిల్కిస్ మాట్లాడుతూ మహిళల సాధికారతకు జెండర్ ఏ విధంగా తోడ్పడుతుందో వివరించారు. మహిళలు నాయకత్వ లక్షణాలు పెంపొందించుకుని, అభివృద్ధిలో భాగస్వాములు కావాలని తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్ ధనశ్రీ, గుంటూరు అర్బన్ ఐసీడీఎస్ ప్రాజెక్ట్ సూపర్‌వైజర్లు, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

బస్టాండు ఆవరణలో లస్సీ పంపిణీ

ప్రత్తిపాడు: స్థానిక బస్టాండు ఆవరణలో వృద్ధులు, వికలాంగులకు బుధవారం గ్రామానికి చెందిన ఏఐటీయూసీ నాయకుడు కుంచాల అంకమ్మరావు సహకారంతో అందరి ఆనందం సామాజిక సేవా గ్రూప్ ఆధ్వర్యంలో ప్రయాణికులకు, పాదచారులు, వికలాంగులు, వృద్ధులకు లస్సీని పంపిణీ చేశారు. కార్యక్రమంలో సీపీఐ మండల ప్రధాన కార్యదర్శి ఆదేశ్వరరావు, గ్రూప్ ఫౌండర్ ఆంజనేయులు, మీరా సాహెబ్ పాల్గొన్నారు.

యంత్ర సేవా పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలి



తక్కెళ్లపాడులో పరికరాలను పరిశీలిస్తున్న ఏవో

పెదకాకాని: రైతులంతా యంత్ర సేవా పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి పి. సంధ్యారాణి సూచించారు. మండలంలోని తక్కెళ్లపాడులో చౌడేశ్వరి కస్టమ్ హైరింగ్ సెంటర్ గ్రూపు పొందిన వ్యవసాయ యంత్ర సేవా పరికరాల్ని బుధవారం ఏవో పి. సంధ్యారాణి, సిబ్బంది తనిఖీ చేశారు. అనంతరం గ్రూపు సభ్యులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఏవో మాట్లాడారు. పథకంలో రైతులకు సబ్సిడీపై అందజేసిన పరికరాల్ని గ్రామంలోని రైతులకు అద్దె ప్రాతిపదికన ఇచ్చి పేర్లను రిజిస్టర్‌లో నమోదు చేయాలని సూచించారు. ప్రభుత్వ నిబంధనల మేరకు యంత్ర పరికరాల్ని ఉపయోగించుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో వీఏవో శివాజీ, వీఏఏలు, రైతులు పాల్గొన్నారు.